చిన్నకథ

# నాన్నగారూ!... నన్ను క్షమించండి

గోపాలకృష్ణయ్య గారు వణికే చేతుల్తో ఆ కాగితం మడతలు విప్పారు. అక్షరాలు అలుక్కు పోయినట్లున్నాయి. కూడ బలుక్కుని చదవటం మొదలు పెట్టారు గొణుక్కుంటున్నట్టు.

''ప్రియమైన నాన్నగారికి!

నమస్కారం. నేను మీ కిలాంటి ఉత్తరం రాయాల్సొస్తుందని కలలో కూడా అనుకోలేదు. కానీ... రాస్తున్నాను...నన్ను క్షమించండి!

నన్ను కని అమ్మ కన్ను మూసినప్పటినుంచీ నాకన్నీ మీరే అయి పెంచారు. తాతయ్య ఇంకో పెళ్ళి చేస్తానని పోరినా సవతి తల్లి నన్నెక్కడ సరిగ్గా చూసుకోదోనని పెళ్ళిమాట తలపెట్టని మంచి నాన్న మీరు. మీరే నా ఒళ్ళు రుద్ది స్నానం చేయించే వారు. నాకిష్టమైనవని చేసి కడుపునిండా తినిపించే వారు. మంచి బట్టలు వేసి, శుభ్రంగా తయారుచేసి బడిదాకా వచ్చి దిగబెట్టే వారు. గేటు దగ్గర నిలబడి లోపలికి పోనని మారాంచేస్తే ''బాగా చదువుకోవాలి. పెద్ద ఇంజనీరవాలి. అప్పుడే మంచి పెళ్ళామొస్తుంది. మనింట్లో 'అమ్మ' లేదు గదా!... అప్పుడే నీ పెళ్ళామే నాకూ... తాతయ్యకు 'అమ్మ' అవుతుందని... ఏవేవో తమాషాగా చెప్పి పంపించే వారు.

క్లాసులో ఫస్టు మార్కొచ్చి.... స్కూలు ఫంక్షనులో ప్రైజు తీసుకోటానికి నేను స్టేజీ మీదకు పోతుంటే మీరు చిన్న పిల్లాడిలా సంబరపడే వాళ్ళు. 'మీకు కష్టం కలిగించే పని ఎప్పుడూ చేయనని ఒట్టేసుకున్నానప్పుడు. ఆ ఒట్టు తీసి ఇప్పుడు గట్టు మీద పెట్టేస్తున్నాను నాన్నగారూ!.... నన్ను క్షమించండి.

సెవెన్తు క్లాసులో జిల్లా ఫస్టొచ్చినప్పుడు మీరు నాకు కొనిచ్చిన 'ప్రసాద్' మార్క్ పెన్ను ఇప్పటికీ నా దగ్గరే భద్రంగా వుంది. దానితోనే రాస్తున్నా నాన్నగారూ ఈ



ఉత్తరాన్ని. శ్రావణి టెన్త్‌లో నా క్లాస్‌మేట్. ఇంటర్‌లో నాకు పోటీ. నేను ఎం.పీ.సి. తీసుకుని ఐఐటీ చేయాలని మీ కోరిక. మొదటిసారి మీ మాట కాదన్నాను. బైపీసీ తీసుకుంటానని మారాం చేశాను. శ్రావణి బైపీసి తీసుకుంది. అందుకే ఆ గోల. అప్పుడు మీకు చెప్పలేదు. ఎమ్‌సెట్‌లో 'మంచి రేంకు తెచ్చుకుంటానని' ప్రామిస్ చేశాను. మంచి రేంకొచ్చినా కాకినాడ కాలేజీలో డొనేషన్ కట్టి చేరతానని గోల చేశాను. ఎందుకో తెలుసా? శ్రావణి కొచ్చిన రేంకుకి ఆ కాలేజీలోనే సీటొచ్చింది మరి. ఎక్కడ క్లాసు పీకుతారోనని ఆ విషయం మీకు చెప్పలేదు''.

''... సాదర ఖర్చుల కోసం హాస్టలు ఛార్జీలనీ... బుక్సనీ... పరీక్ష ఫీజని ఏదో వంకతో డబ్బులు పంపించమని అడుగుతుంటే... ఏనాడూ 'ఎందుకురా ఇంత డబ్బు?' అని ఆరా తీయలేదు. ఎలా తంటాలు పడేవాళ్ళో... టంచనుగా ఎమ్వో వచ్చేది! అంత పిచ్చి ప్రేమ మీకు నా మీద! శ్రావణి మైకంలో పడి కొట్టుకుపోతున్న నాకవేమీ పట్టేది కాదు అప్పట్లో. ఆమె ఫాదర్ ఇన్‌కమ్ టాక్సులో పెద్ద ఆఫీసరు. దానికి తగ్గట్లే వుండేవి ఆమె సరదాలు. తన ముందు తేలిపోకూడదని నేను తలకు మించిన భారం మోపేవాడిని. శ్రావణి ప్రేమ కోసం నేను పడని పాట్లు లేవు నాన్నగారూ! అందులో సగమన్నా స్టడీస్ మీద చూపించుంటే ఫస్టియర్ పోయేది కాదు.

శ్రావణి ఒకేడు ముందుకు పోయిందని నేనేడుస్తుంటే.... పరీక్ష పోయిందనుకుని నన్ను ఓదార్చారు మీరు. అప్పుడైనా చెప్పలేదు అసలు సంగతి. శ్రావణి వన్ ఇయర్ సీనియర్ అయిపోయినా మా మధ్య స్నేహం చెదరలేదు కదా.. ప్రేమగా మారింది. మా ఎఫైర్‌ని గురించి లోకమంతా కోడై కూస్తున్నా మీ చెవి దాకా రాలేదు. వచ్చినా 'ఛ మా సీను అలాంటివాడు కాదని' కొట్టిపారేసేవాళ్ళే మీరు. మీ పిచ్చి ప్రేమసంగతి నాకు తెలుసుకదా!

గ్రాడ్యుయేషన్ అయి పీజీలో చేరగానే శ్రావణిని తెచ్చి మీకూ తాతయ్యకూ చూపించి ''ఇదిగో నాన్నగారూ! 'అమ్మ'' అని సర్‌ప్రయిజ్ చేయాలని నా పిచ్చి ఆలోచన. అన్నీ మనమనుకున్నట్లే అయిపోతే మధ్యలో ఇంక దేవుడెందుకూ? శ్రావణి హౌస్ సర్జన్సీలో వుండగానే వాళ్లింట్లో పెళ్లి ప్రయత్నాలు మొదలు పెట్టారు. తను వాళ్ల డాడీకి నా గురించి చెప్పింది. నన్ను తీసుకెళ్లి పరిచయం చేసింది. శ్రావణి వాళ్ల డాడీ మీలాగా కాదు నాన్నగారూ.! చాలా ప్రాక్టికల్.

''ప్రేమ అనేది ఇద్దరు అబ్బాయి అమ్మాయిల మధ్య వ్యవహారం. అది పెళ్లిదాకా సాగాలంటే రెండు కుటుంబాల మద్దతు అవసరం శ్రీనివాస్. నా దురదృష్టం కొద్దీ శ్రావణి మా బాస్ కొడుకు కంట్లో పడింది. నో అంటే నాకు రిస్కు తప్పదు. ఇంకో ఇద్దరు ఆడపిల్లలున్నారు కదా. వాళ్లకూ పెళ్లిల్లు చేయాలిగా. నా పొజిషన్‌లో వుంటే నువ్వేం చేస్తావో చెప్పు.. నేనూ అదే చేస్తాను'' అన్నాడాయన.

నేనేమీ చెప్పకుండానే ఆయన చేయాల్సింది చేసేసాడు.

తనకు పెళ్లయిన మర్నాడు శ్రావణి ఫోన్ చేసి ''సారీ సీనూ. పెద్దాళ్లమాట కాదనలేక పోయాను'' అని ఒక్క ముక్క చెప్పి లైన్ కట్ చేసింది. శ్రావణి కోసం నేను మీకు తొమ్మిదేళ్ల బట్టీ వందల కొద్దీ అబద్ధాలు చెబుతూ వచ్చాను. ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పెట్టాను. ఇంకొక్కసారి.. చివరిసారి.. ఇబ్బంది పెట్టక తప్పలేదు నాన్నగారూ..! క్షమించండి!

వంటికి తగిలిన దెబ్బయితే మందు రాసుకుని మానిందాకా ముసుగేసుకుని పడుకోవచ్చు. ఇది మనసుకు తగిలిన దెబ్బే! తట్టుకోవటం కష్టంగా వుంది నాన్నగారూ! మిమ్మల్ని వదిలి వెళ్లిపోతున్నాను. క్షమించండి!

ఇన్నేళ్లూ దాచి ఇప్పుడే ఇదంతా ఎందుకు చెబుతున్నావని మీరడగవచ్చు. ఇప్పుడు కూడా చెప్పకపోతే ఇంకెప్పుడూ చెప్పే అవకాశం లేదు. నేనేమీ చెప్పకుండా సైలెంట్‌గా వెళ్లిపోతే నా ఓటమికి మిమ్మల్ని బాధ్యుల్ని చేసుకుని జీవితాంతం కుమిలి పోతారు. మీ పెంపకంలోని లోపం అనుకుంటారు. అది తప్పు. లోకంలో ఏ తండ్రీ.. ఆ మాటకొస్తే ఏ తల్లీ తన బిడ్డను ప్రేమించలేనంత ఎక్కువగా మీరు నన్ను ప్రేమించారు. ఇది చెప్పటానికే ఈ చివరి ఉత్తరం రాస్తున్నాను. ఈ సారి జన్మలో మళ్లీ మీ కొడుకుగానే పుట్టి నా తప్పులను సరిదిద్దుకుంటా.. ప్రామిస్. ఉంటా.. టాటా.. తాతయ్యకు నా నమస్కారాలు చెప్పండి!

ఇట్లు ప్రేమతో శ్రీనివాస్.

***

నలిగి మాసిపోయి మడతల దగ్గర పట్టుకుంటే చిరిగిపోయేటట్టున్న ఆ పాత ఉత్తరాన్ని మళ్ళా భద్రంగా మడతలు పెట్టి టేబుల్ సొరుగులో దాచి లేచారు గోపాలకృష్ణయ్యగారు నిట్టూరుస్తూ.

ఏడవటానికి ఆయన కళ్ళల్లో నీళ్లు లేవిప్పుడు. ఎనభైయేళ్లు దాటిన పండు ముదుసలి ఆయనిప్పుడు.

గోడమీదున్న దండేసిన ఫోటోలో నుంచీ శ్రీనివాస్ చిరునవ్వుతో చూస్తున్నాడు.

''నీకేం నాయనా..! నవ్వుతాలుగానే వుంటుంది.. ఏడాది కిందట నువ్వు కృష్ణాలో పడ్డావు. మీ నాయన కోమాలో పడ్డాడు. నీ ఉత్తరం చదువు కొనేందుకు వాడెప్పుడు స్పృహలోకి వస్తాడో తెలీదు. నువ్వంటే జన్మనిచ్చిన తండ్రిని పున్నామ నరకానికి వదిలేసి పోయావుగానీ.. జన్మనిచ్చిన పుణ్యానికి నేను నా కొడుకుని ఇలా అర్థాంతరంగా వదిలేసి పోలేను గదా? కొడుకుతో సేవలు చేయించుకోవాల్సిన ఈ వయసులో కొడుక్కి ఇలా సేవలు చేయమని ఆ భగవంతుడు నా నుదుటన రాసి పెట్టాడు.. భగవంతుడు కాదు.. నువ్వే రాసి పెట్టి పోయావు మనవడా..!'' అని గొణుక్కుంటూ కొడుకు గదిలోకి నడిచారు గోపాల కృష్ణయ్యగారు.

– కర్లపాలెం హనుమంతరావు